# హాలీడే స్పిరిట్

జైల్లోనుంచి విడుదల పొంది వచ్చిన ఆసామీకి మళ్ళీ జెయిలుకు వెడదామనే ఆసక్తిగాని అనురక్తిగాని లేకపోవచ్చును కాని, మళ్ళీ తనను జెయిలుకు పంపించే పనులను మాత్రం అతడు సర్వసాధారణంగా చెయ్యకుండా ఉండలేడు.

*  *  *

పనిపాటలతో విసిగిపోయిన కార్మిక సోదరులూ, గుమాస్తాలూ, ఉద్యోగస్తులూ, తదితరులూ శెలవు దినాలు ఎప్పుడు వస్తాయా, ఎప్పుడు యీ మిల్లుకూతలూ, టైపురైటరు చప్పుళ్ళూ, తలపాగాలు చుట్టడం, విప్పడం, ఆఫీసునుంచి ఇంటికీ, ఇంటినుంచి ఆఫీసుకీ, కాఫీ ప్లాస్కుల మోతా మొదలైన యీతిబాధలనుంచి తాము తప్పించుకుంటామా అని ఎదురు చూస్తూవుంటారు. కాలక్రమేణా యీ ఖైదీలకు విడుదల దినం సమీపిస్తుంది-శెలవులు! స్వేచ్ఛ! ప్రయాణాలు! బంధుమిత్ర సందర్శనాలు! ఏనాడో విడిచిపెట్టిన స్వగ్రామాలూ, తోటలూ, దొడ్లూ, జన్మస్థలాలూ—వీటి పునర్దర్శనం! ఇంతకంటే కావలసిందేముందీ!

*  *  *

బుట్ట తలపాగాలూ, లాంకోట్లూ మాయమవుతాయి. ఆఫీసు ఫైల్సు, రెడ్ టేప్సు అటకెక్కుతాయి; బిల్సు, క్రాస్ చెక్సు ఆదరించేవాడు లేక అనంతశూన్యంలో అటమటించిపోతాయి; ఫేక్టరీ చిమ్నీలకు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కట్టుబడిపోతై. ప్రపంచమంతా ఒక పెద్ద 'ఫెయిరీలాండు' కింద మారిపోతుంది; జనమంతా అందులో గంధర్వులుగానూ, యక్షులుగానూ, దేవకన్యలుగానూ, మారిపోతారు. ప్రతివాడూ కూడా ఆ శెలవు దినాల్లో ఒక్క నిముషంకూడా వృధాపోనివ్వకూడదనీ, అందులోని ప్రతి సెకండునూకూడా అనుభవించి తీరాలనీ తీర్మా

రించుకునే పరములోభికింద తయారవుతాడు. ప్రతివాడి దృష్టికూడా తాను పనిచేసే స్థలంనుండీ, పనిముట్లనుండీ, తన దాస్యానికీ, బానిసత్వానికీ పెనుభూతమంత సాక్ష్యమై నిలచిన పట్నాన్నుంచీ సాధ్యమైనంత దూరంగా-మళ్ళీ అభూతం తన్నుతిరిగి పట్టుకోడానికి సాధ్యంకానంత దూరంగా-పోదామనే పోయి స్వర్గంవంటి ఒక నూతన ప్రపంచాన్ని సృష్టించుకుని ఆనందిద్దామనే, మరి ఆ నూతన ప్రపంచంనుంచి యివతలకు రాకుండా వుందామనే—

*　　*　　*

ప్లాట్‌ఫారాల్లో, పళ్ళబుట్టలూ, రైలెక్కుతాయి. రైలు కూస్తుంది - రంగురంగుల చీరలూ, వింతవింత దుస్తులూ, సివిలు చట్టాలకు లోబడి ఎవరియిష్టం వచ్చినట్టు వాళ్లు ప్రవర్తించగలిగే స్వేచ్ఛ, బానిసతనంలో నిలవచేసుకున్న డబ్బు-వీటితో, పరమానందంతో-రైలు కదిలేసరికి— జైల్లోనుంచి ఖైదీ యివతలకు విడిచిపెట్టబడినట్టే - తమను భ్రష్టుచేసి, తమ శక్తి సామార్థ్యాలనూ, ఆరోగ్యాన్ని, మన శ్శాంతినీ, వ్యక్తిత్వాన్ని నాశనంచేసి విడిచిన పట్నం-అవధ్యశిల-తమనుండి దూరమవుతున్న కొద్దీ-దానిస్థానే పచ్చటిపైరులూ, నీలినీడలూ, మెడలో మువ్వలతో ఘంగుచెంగున గెంతే కోడెదూడలూ, శాంతి సౌభాగ్యాలతో తులతూగే పల్లెపట్టులూ నూటికి నూరుపాళ్ళు ప్రాణవాయువు కలిగి వుండే, పన్ను విధింపబడని గాలి - యివన్నీ తమకు దగ్గిరవుతూన్న కొద్దీ కలిగే ఆనందం, మనశ్శాంతి, 'డివైనిటీ'— జైలునుంచి ఇంటికి వచ్చి ముసలితల్లినీ, భార్యనూ, పిల్లలను చూసేభాగ్యం పొందిన ఖైదీకే తెలుసును - వీరికే తెలుసును!

*　　*　　*

దినాలు గడుస్తూవుంటై. హాలీడేస్పిరిట్ ప్రతివారినీ పూర్తిగా ఆవరించుకుంటుంది. మామూలుగా ఉదయం ఆరుగంటలకు లేచేవారు పదిగంటలకు లేవడం నేర్చుకుంటారు. ఆఫీసు, ఇల్లు, ఈ రెంటినీ కలిపే

రోడ్డుతప్ప మరేమీ ఎరగనివారంతా ఇప్పుడు ఏ తోటలో చూసినా, ఏ దొడ్లోచూసినా, ఏ విహారస్థలంలో చూసినా, ఏ పెంటమీద చూసినా కనిపిస్తారు; చెరువులలోనూ, కాలవలలోనూ అడ్డంపడి ఈత ప్రారంభిస్తారు - మామిడితోపులో వనసంతర్పణలకు హాజరవుతారు. కనుపించిన ప్రతి గ్రామస్తుడితోటీ పట్నంలో తమ హోదా, ప్రజ్ఞా విశేషాలు మొదలయినవన్నీ చెప్పి, దబాయించి Make Of Greatness కొట్టేశాం గదా అని గర్విస్తారు - ఇంతలో 'రేపటితో శెలవులు అయిపోతాయి. ఎల్లుండి పొద్దున్నే మళ్ళీ తలపాగా చుట్టాలి' అనేది వారి మనస్సుకు తట్టుతుంది - ఉలిక్కి పడతారు - భీభత్సరసం వారి ముఖంలోంచి స్రవిస్తుంది - సెలవు లయిపోయాయి అని వారి చెవులో ఒక ఎయిర్ రెయిడ్ సైరెన్ కూస్తుంది!

* * *

తిరిగి జెయిలు వాతావరణంలో ప్రవేశించడం-చేసినపనే సంవత్సరాల తరబడి చేస్తూవుండడం - ఆరుగంటలకే లేవడం - కడుపులో మెతుకులు కడుపులో వుండగానే ఆఫీసుకు పరుగెత్తడం - రొటీన్-వెధవ రొటీన్ - పాచిఇల్లు ఊడ్చి, శుభ్రంచేసి, దుమ్ముచేసి, మళ్ళీ ఊడ్చి, శుభ్రంచేసి, మళ్ళీ దుమ్ముచేసినట్టే - దానికి ఎవరికి మనస్సు వప్పుతుంది? వప్పదు-వెధవ పనికి వెళ్ళకూడదు - ఇలా జన్మాంతరం హాలిడేస్పిరిట్తోనే వుండాలి - అంటూ అంతరాత్మ ఎలుగెత్తి ఏడుస్తుంది - ఓ మూల చేతులు సర్దే సామాను సర్దుతూనే వుంటాయి ప్రయాణానికి; డబ్బు అయిపోయింది. శెలవాఖరున మళ్ళీ జీతం అందుకుంటేనే గాని గతి లేదని ఆర్థికనాడి పొడుస్తూంటుంది - విశేషించి, ఈ వెధవ అనాగరికపు పల్లెటూరు, మోటుమనుషులు, పశువుల పెంట, మట్టిరోడ్డు — ఛ! హాయిగా మన పట్నం మనంపోతే-తారురోడ్డు, ట్రాములూ, బస్సులూ,- అయినా శెలవులంటే శెలవులే - ఎల్లకాలం వస్తాయా? పాటుపడి పని చేస్తేనే కాని శెలవుల మజా ఏం తెలుస్తుంది? వేడిని తాకుతే వచ్చిన

అనుభవం పొందితేనేగాని శీతలంలోని హాయి అర్థంకాదు-ఎక్కించం డోలు సామాను రైలెక్కించండి-పోదాం!—

* * *

ఖైదీ తిరిగి జైల్లో పడతాడు! ఈ మాటు విడుదలపొందితే యిక మరి జైలు ముఖం చూడకూడదని పంచభూతాల సాక్షిగా ప్రమాణంచేస్తాడు. కాని, విడుదల అనేది మళ్ళీ జరిగితే గిరిగితే అది తిరిగి మళ్ళీ అతడ్ని జైలు ఆవరణలోకి తరమడానికే అని అతడికి తెలియదు పాపం!

Printed at the B. N. K. Press, Q. H. No. MS. 100/B.
For Q. H. No. 401, Cat. D. 750 Copies—May 1946.